**దయ్యాలకంటే భయంకరమైన మనుషులున్నప్పుడు దయ్యాలంటే భయమెందుకు?**

# అతనికంతా తెలుసు




పి. శ్రీనివాసశాస్త్రి

తెల్లవారిన ప్రతి రోజూ ఆమెకో వింత. అతను కళ్ళు తెరుస్తూనే ఆమెకోసం ఆరాటపడతాడు. స్నానం చేసి, కాటుకా బొట్టూ పెట్టుకుని రాత్రంతా మంచులో తడిసిన కలువ పువ్వు పొద్దున్న లేత సూర్యుడి కిరణాలు సోకి తళుక్కున మెరిసినట్టుగా కనిపించాలి ఆమె అతనికి. ఆమె అలాగే తన ముఖాన్ని అతనికి దగ్గరగా చేర్చి భక్తిభావంతో చూస్తుంది. అతను చిటిక వేస్తాడు బుగ్గ మీద. పూర్తి మెలకువతో లేచి మంచంమీద బాసింపీట వేసాడు.

"సుశీలా.... ఈ రోజు యేమయ్యిందో తెలుసా....తిరుపతి ఘాట్ రోడ్డు దగ్గర పెద్ద బస్సు ప్రమాదం తప్పిపోయింది. లోయలోకి పడిపోవాల్సిన బస్సు డ్రైవరు సమయస్ఫూర్తివల్ల నిలదొక్కుకుంది. ప్రయాణీకు లందరూ క్షేమమే కాని ఓ వ్యాపారి.ఆయనకి గుండెజబ్బు. ఆయన ప్రమాద భయంతో గట్టిగా అరిచి బస్సులోనే ప్రాణం విడిచేశాడు."

సుశీల మంత్ర ముగ్ధురాల్లా వింటూంది. భర్త రాజారావు మాట్లాడుతుంటే ఆమెకి పెదిమ కదపకుండా గంటల తరబడి వినాలని ఉంటుంది. అతను వార్త చెప్పి లేచి బాత్‌రూమ్‌కి వెళతాడు.

సరిగ్గా అప్పుడే జరుగుతుంది వింత.




బాయ్ విసిరిన పేపర్.నడవలోకి వచ్చి పడుతుంది. సుశీల పేపర్ చేతిలోకి తీసుకుని ఆత్రంగా పేజీలు తిరగవేసుంది. భర్త చెప్పిన వార్త కనిపిస్తుందామెకి.కొద్ది మార్పుతో అతను చెప్పిన వార్తంతా వుంటుంది.

* * *

"క్లయిర్ వాయిన్స్. జాన్ డిక్సన్. సైకోసిస్ అనే అతీంద్రియ శక్తులగురించి విన్నాను". అన్నాడు రామానుజం గ్లాసు నింపుకుంటూ.

"ఆగు.. పూర్తిగాచెప్పనీ...."అన్నాడు సుందరం గ్లాసులో మిగిలిన ద్రావకం ఒక్క గుక్కలో పూర్తిచేసి.

"బ్రదర్ ఎన్నయినా చెప్పు.... దెయ్యాలూ.... ఈ అతీంద్రియ శక్తులు వీటిమీద నాకు నమ్మకం లేదు. దెయ్యాలున్నాయనీ నాచేత ఒప్పించలేవు నువ్వు."

"నువ్వు ఒప్పుకోకపోతే నీ కర్మ.... దెయ్యాలున్నాయి" అన్నాడు సుందరం సవాలుగా.

"ఉంటే ఉండనీగాక. ప్రొసీడ్! కథ ఇంటరెస్టింగా వుంది" రామానుజం తొందరపెట్టాడు.

"అసలు సుశీలని రాజారావు కోరి పెళ్ళి చేసుకోవడం గురించి చెబితే నీకు చాలా వింతగా వుంటుంది."

రామానుజం వినడానికి సిద్ధపడ్డాడు.

సుందరం రెండో రౌండు మెల్లగా

కానిస్తూ మధ్యమధ్య చేతిలో గ్లాసుని గుండ్రంగా తిప్పుతూ—లలితంగా. లలిత సంగీతం వినిపిస్తున్నంత సుతారంగాచెప్పుకొస్తున్నాడు.

* * *

సుశీలకి అప్పుడుతొమ్మిదేళ్ళవయస్సు. చాలా విశాలమైన కళ్ళు. బరువైన కనురెప్పలు. సూది ముక్కు. చామన ఛాయ. బారెడు జుట్టు. అంతచిన్న వయస్సులో కూడా ఆమెని ఒంటిగా స్కూలుకి పంపాలంటే తల్లిదండ్రులకి భయంగావుండేది. అన్నగారు తోడు లేనిదే యెక్కడికీ పంపేవారు కాదు ఆమెని.

ఓ రోజు అన్నకి జ్వరం వచ్చి ఆమె ఒక్కత్తీ స్కూలుకి వెళ్ళింది. మామూలు రోజయితే తల్లి దండ్రులు సుశీలని ఆ రోజు స్కూలు మాన్పించేవారే. ఆ రోజు పరీక్ష రోజవడంతో పంపించక తప్పలేదు. వాళ్లు భయపడ్డంతా అయింది. పరీక్ష టయిము అయిపోయినా సుశీల రాలేదు. స్కూలుకి వెళ్ళి వాకబు చేశాడు తండ్రి శేషయ్య. లాభం లేకపోయింది. చీకటయిపోయింది. సుశీల ఇంటికి రాలేదు. శేషయ్య దంపతులు భయంతో వణికిపోయారు. అన్నగారు కూడా ఏడుస్తూ తండ్రివెంట బయలుదేరాడు. ఊరంతా వెతికారు. ఊరవతల రోడ్డుమీద వీధిలైటుకింద కనిపించాయి కూర్చున్న భంగిమలో రెండు ఆకారాలు.

ఆశతో శేషయ్య అడుగుల వేగం పెంచాడు. జ్వరంతో పరుగు తీయబోయి బోర్లాపడి, "చెల్లాయ్, చెల్లాయ్!" అంటూ ఏడుపు లంకించుకున్నాడు అన్నగారు.

శేషయ్య రాకగాని, అన్నగారి అరుపులుగాని సుశీల చెవిన సోకినట్టు లేదు. "ప్రేమించు ప్రేమకై .... ఏమింకవలెనో!" అన్నట్టు వొకళ్ళ ముఖంలోకి ఒకరు చూస్తూ ఆ వీధి లైటుక్రింద వూసులాడుకుంటున్నారు.

ఆ కుర్రాడు కత్తిలా వున్నాడు. చురుకైన కళ్ళు-కళ్ళలో తళుకు— "మీవాళ్ళు నీకోసం కంగారు పడుతున్నారు. ఇంటికెళ్ళు" అంటున్నాడతను.

"ఏవిటో వెళ్ళబుద్ధి కావటంలేదు" అంటోంది సుశీల.

"మనకేం భయంలేదు. నేనెలాగూ నిన్నే పెళ్ళి చేసుకుంటాను. ప్రామిస్ .... పద .... నిన్ను మీ ఇంటి మలుపు దాకా దిగబెడతాను."

ఆ అబ్బాయి లేచి సుశీల చెయ్యి పట్టుకున్నాడు.

ఇద్దరూ చెట్టాపట్టా లేసుకుని నాలుగడుగులేసి ఆగిపోయారు.



శేషయ్యకి వళ్ళు మండిపోయింది. "ఏమే వీడెవడూ! ఇక్కడేం చేస్తున్నావ్-" ఇంకేమనాలో తెలియక ఉరిమి చూశాడు శేషయ్య.

"నువ్వెవిడివిరా మా చెల్లెలి చెయ్యి పట్టుకున్నావ్!" ఎక్కడికెళ్ళినా తన తోడు లేనిదే వెళ్ళని చెల్లెలు ఇంకో తోడు వెతుక్కున్నందుకు ఉక్రోషంతో ఆ కుర్రాడి మీదికి లంఘించాడు అన్న.

ముగ్గురు చిన్నపిల్లల మధ్య శేషయ్య పెద్దరికం వెలవెలపోయింది. ఆవయసులో వాళ్ళని ఏ రకంగా మందలించాలో తెలి

యక. బుద్ధిగా చదువుకుంటున్నట్టు కనిపించే కూతురుకి అంత చిన్న వయసులో కలుగుతున్న ఆలోచనలేమిటో అంతు పట్టక శేషయ్య డీలాపడిపోయాడు.

"ఇంకోసారి ఇలా చేశావంటే...." అని కూతురుకేసి మళ్ళీ గుడ్లురిమి చూసి, "వెళ్ళోయ్ దద్దమ్మలా వెధవాయ్" అని ఆ కుర్రాణ్ణి మందలించి, కోపం నటిస్తూ, అతని పేరూ తల్లిదండ్రులెవరైందీ కనుక్కొని ఆ రాత్రి బాగా పొద్దుపోయింతర్వాత కూతురుని తీసుకుని ఇంటికొచ్చాడు.

ఆ మర్నాడు గమ్మత్తు జరిగింది.

ముక్కూ మొహం తెలియని పెద్ద మనిషి శేషయ్య యిల్లెక్కడ అంటూ కనుక్కుంటూవచ్చి తన పేరు వీరభద్రం అని పరిచయం చేసుకొన్నాడు.

"మీ అమ్మాయి, మా అబ్బాయి సంగతి తెలిసింది. ఈ రోజే నేను బెజవాడ ట్రాన్స్ఫరై వెళ్ళిపోతున్నాను. నా అడ్రసు యిస్తాను. నన్ను కాంటాక్టు చేస్తూ వుండండి. మావాడు మామూలు కుర్రాడు కాదు. వాడు చెప్పినది చెప్పినట్లు జరుగుతూ వుంటుంది. ఈ విషయంలో మీకు నమ్మకం లేకపోతే నేను చెయ్యగలిగింది లేదు" అన్నాడు.

శేషయ్యకి అరికాలి మంట నెత్తికెక్కింది. "ఎద్దులా ఇన్నేళ్ళొచ్చి పిల్లలు చేసిన వెధవపనికి వెనకేసుకొచ్చి తగుదునమ్మా అంటూ ముక్కుపచ్చలారని పిల్లకి పెళ్ళికబుర్లు తెస్తావుటయ్యా" అన్న ధోరణిలో దులిపేశాడు. వీరభద్రం భద్రంగా వొచ్చిన దోవనే వెళ్ళాడు. అతనిచ్చిన అడ్రసు కాయితం అటుతర్వాత ఎటుపోయిందో తెలియదు.

* * *

ఇంకో సిప్ మెక్డోవెల్ కోసం బేరర్ని పిలిచాడు సుందరం.

"ఈ కథకీ దెయ్యాలకీ సంబంధమేమిటసలు?" అని అడిగాడు రామానుజం వాదనకి దిగుతూ....

"ఓపికపట్టు నాయనా" అన్నట్టు చూసి సుందరం మళ్ళీ కథలోకి దిగాడు. బేరర్ కొత్త సిప్ తెచ్చి గ్లాసులు సర్దుతున్నాడు.

* * *

సుశీలకి పెళ్ళయింది. భర్త ఇంజనీరు. సాగర్ డామ్ దగ్గర పని. పెళ్ళయి ఏడాది తిరక్కుండానే అతను పోయాడు, డామ్ ఒక భాగం కూలిపోయిన సంఘటనలో. అందు గురించి సుశీల ఏమీ బాధపడలేదు. ఎందుకంటే అతను సాడిస్టు. సుశీలని శారీరకంగా బాధిస్తూ కొడుతూ తన్నుతూ వికటానందం పొందేవాడు. కొత్తలో బెంబేలుపడింది. ఒక దశలో సుశీల అతన్ని చంపేసి పీడ వదిలించుకుందామని నిర్ణయించుకుంది కూడా. ఆ నిర్ణయానికి రాగానే ఒక వింత జరిగింది ఆమె చెవిలో రహస్యంగా ఒక స్వరం వినపడేది — "వీడెంతో కాలం బతకడు త్వరలోనే పోతాడు. భయపడకు నేనున్నా" అనేది ఆ కంఠం. కొత్తలో సుశీల కేవలం భ్రమ అని కొట్టిపారేసింది. కానీ భర్త తనని బాధించినప్పుడల్లా ఆ గొంతు వినపడేది చెవిలో. ఆ గొంతు వింటున్నప్పుడు ఆమెకి మధుర సంగీతం వింటున్నంత తన్మయత్వం కలిగేది ఆ ఒకటి రెండు క్షణాలపాటు. చివరికా ఇంజనీరు భర్త డామ్ కూలి చచ్చాడు. డామ్ వల్ల లాభాలు లేకపోలేదు అనుకుని సుశీల పుట్టింటికొచ్చేసింది.

చిన్నతనంలో వైధవ్యం ప్రాప్తించిన కూతుర్ని చూసి ఇంకా ముసలితనానికి ఇవతలే ఉన్న ఆమె తల్లిదండ్రులు నిత్యం రోదిస్తూ ఉండేవారు. ఆ దిగులుతో వాళ్ళు ముందే ముసలితనం తెచ్చుకున్నారు. బెజవాడలో సుశీల అన్నగారు ఉద్యోగం చేస్తూ తల్లిదండ్రుల్నీ చెల్లెల్నీ వచ్చి కొన్నాళ్ళు తన దగ్గర ఉండవలసిందిగా కోరాడు. శేషయ్య లాంగ్‌లీవ్ పెట్టి అలాగే చేశాడు.

కథ బెజవాడలో మలుపు తిరిగింది.

సుశీలని పెళ్ళాడతానన్న అలనాటి కుర్రాడు రాజారావు అడ్రసు తెలుసుకుండానే నేరుగా వాళ్ళింటికొచ్చి శషభిషలేమీ లేకుండా చెప్పాడు, సుశీలని తాను పెళ్ళి చేసుకోదలచాననీ. ఆమెతో ఐదునిమిషాలు మాట్లాడనివ్వండనీ. అతనూ ఆ వూళ్ళోనే ఉద్యోగం చేస్తున్నాడు.

శేషయ్యకి లీలగా చిన్నప్పుడు సుశీల, ఆ కుర్రాడు సాగించిన గ్రంథం గుర్తొచ్చింది.

ఆశ్చర్యపోయి సరేనని ఒప్పుకున్నాడు.

అంతవరకూ అవతలి గదిలో ఉండి అతని మాటలు వింటున్న సుశీలకి ఆ స్వరం తన చెవిలో తనకి ధైర్యం చెబుతున్నప్పటి స్వరంలాగే తోచింది. మధుర సంగీతం వింటున్నట్టే తన్మయంగా ఉంది ఆమెకి. అంతలో అతను ఐదు నిమిషాల ఇంటర్‌వ్యూ కోసం ఆ గదిలోకి అడుగు పెట్టాడు.

చిరకాల పరిచయంవున్న మనుషుల్లా చూసుకున్నారు ఒకరి నొకరు. ఆమె దిగ్గునలేచి అతన్ని నఖశిఖ పర్యంతం చూసి కాళ్ళకు వంగి నమస్కరించింది.

అప్పుడో చిత్రం జరిగింది.

ఆమె తన చేతులతో అతని పాదాలు తాకీ తాకగానే ఢబ్బున పెద్ద శబ్దం అయింది. ఆ శబ్దానికి ఆమె గుండెలు అవిసిపోయాయి.


అతను తీక్షణంగా గోడకేసి చూశాడు.

ఓ నిమిషం తరవాత తేరుకొని చెప్పాడు "మన పెళ్ళి ఈ వారంలోనే జరిగిపోవాలనుకున్నాను. కానీ ఓ మూడు నెలలు వాయిదా వేసుకుందాం. నువ్వింకా పడగనీడలోనే ఉన్నావ్." అన్నాడు.

అలా అని గోడదగ్గరికి అడుగులేసి గోడమీంచి జారిపడిన వెంకటేశ్వరస్వామి పటం చేతుల్లోకి తీసుకున్నాడు.

"నెల్లాళ్ళుకూడా ఆగలేను" అన్నట్టు చూస్తున్న సుశీల ముఖంలోకి గుచ్చి గుచ్చి చూస్తూ, "చచ్చిపోయిన నీ ఇంజనీరు భర్తకి నువ్వు నా పాదాలు ముట్టడం నచ్చలేదు. తన శక్తి చూపిద్దామనుకున్నాడు నామీద. కాని దైవబలం అడ్డుపడింది" అని వివరించి పటం మళ్ళీ మేకుకి తగిలించాడు.

"ఈ మూడు నెలలూ నేను నీకు కన



పడను. ఈ పటాన్ని పూజిస్తూ ఉండు. ఈ మూణ్నెళ్ళూ. ఈలోగా వాడి క్షుద్ర శక్తిని జయించి మళ్ళీ నీ దగ్గరకొచ్చి పాణిగ్రహణంచేస్తా" అన్నాడు.

ఐదు నిమిషాల ఇంటర్‌వ్యూ ముగిసింది.

అతను చెప్పినట్టు మూణ్నెల్లపాటు సుశీల ఆ వెంకటేశ్వరుడి పటాన్ని పూజిస్తూనే వచ్చింది. ఆమె దేముణ్ణి పూజించడం ఆ మూడు నెలలే. ఆ తరవాత ఆమెకి రాజారావే దేముడై పోయాడు.

అతనిలో దైవత్వం కనపడిన క్షణాలు ఎన్నో. ఒకసారి అతను పెద్ద రైలు ప్రమాదం ముందుగా వూహించి, ఆ ప్రమాదం జరిగే చోటుకి అటూ యిటూ వున్న రైల్వే స్టేషన్లని అలర్ట్ చేశాడు తంతి ద్వారా. ఫోన్ ద్వారా. అధికారులు అతన్ని ఖాతరు చేయలేదు. ఫలితంగా రైలు బోగీలు తల్లక్రిందులై పాతిక ప్రాణాలు హరించాయి. ఆ ప్రమాదం వార్తతో బాటు రాజారావు అతీంద్రియ శక్తితో ప్రమాదాన్ని ముందే హెచ్చరించడం గురించి ఒకటిరెండు పత్రికలు బాక్సులు కట్టి ప్రచురించాయి.

మరో పత్రిక రాజారావుని ఇంటర్వ్యూ అడిగితే అతను ఇవ్వలేదు.

ఒకసారి సుశీల పుట్టినరోజునాడు "నీకేవన్నా కావాలా?" అని మామూలుగా భార్యని అడిగినట్టు అడిగాడు రాజారావు.

"కావాలి" అంది సుశీల.

ఏమిటన్నట్టు చూశాడు రాజారావు నవ్వుతూ.


"మీకంటే నేనే ముందు తనువు చాలించాలి మీరు లేని ఈ జీవితాన్ని ఊహించలేను" అంది సుశీల.

"పిచ్చిదానా" అంటూ ఆమెని దగ్గరికి హత్తుకున్నాడు రాజారావు.

"చెప్పండి.... చెప్పండి .... నాకా అదృష్టం ఉందా.... చెప్పండి ...." అంటూ వెర్రెత్తినదానిలా ఆమె అతని ఛాతీకేసి తలబాదుకొని ఏడ్చింది.

రాజారావు ఆమెని పరీక్షగా చూశాడు. సుశీల లావెక్కింది. ముఖంలో అందం చెక్కు చెదరకపోయినా ఆమె శరీరం మునుపటి హొయలు కొంత కోల్పోయింది. నడుంమీద ముడతలొచ్చాయి నేను పెళ్ళాడినప్పటి సుశీల వేరు అనే భావం కలిగింది తొలిసారి అతనిలో.

తనమీద ప్రేమతో పుట్టినరోజునాడు కన్నీళ్ళు పెట్టుకుంటున్న ఆమెని నిశితంగా చూసి నిట్టూర్చాడు రాజారావు—"ఎలా జరగవలసింది అలా జరగాల్సిందే!" అంటూ.




"అంటే మీరనేదేమిటి-నాకా అదృష్టం లేదుకదూ" అని అడిగింది సుశీల అతన్ని కుదిపేస్తూ.

"నాకే ఆ అదృష్టం లేదు సుశీలా - నిజం. నీ ప్రేమని వార్ధక్యంలో అనుభవించే యోగ్యత లేదు నాకు. నువు పునిస్త్రీగానే వెళ్ళిపోతావు. నీ తీపి గుర్తులు నెమరువేసుకొంటూ నీ పరోక్షంలో నేను శేష జీవితం గడుపుతాను. ఇది నిజం...." అన్నాడు రాజారావు.

ఆ రోజు సుశీల జీవితంలో సంపూర్ణ ఆనందం అంటే ఏమిటో అర్థమైనట్టు తృప్తిగా నవ్వింది. అతన్ని పెనవేసుకుంది."ప్రమోషన్ వచ్చిన మరునాడే నా పుట్టిన రోజొచ్చింది ఇద్దరం ఈ రోజుని కులాసాగా గడుపుదాం." అంటూ చిన్నపిల్లలా సంబరపడిపోతూ అడిగింది.

"లాభంలేదు సుశీలా! నిన్ననే మేనేజర్నయ్యాను. ద్వితీయ విఘ్నం కూడదు. నేను ఆఫీసుకి వెళ్ళి తీరాలి" అన్నాడు.

అతని ఇష్టాన్ని ఎన్నడూ కాదనదు సుశీల. చాలా త్వరగా తన కోరిక మరిచిపోయింది. రాజారావు ఆఫీసు కెళ్ళిపోయాడు

ఆ రోజే ఆమె పుట్టిన రోజు. సరిగ్గా ఆ రోజే ఆమె చనిపోయిన రోజయ్యింది!

* * *

రామానుజానికి కడుపులో ఏదో నాట్‌గా వొళ్ళు జలదరించింది.

"దెయ్యాలున్నాయని నమ్మకం కలిగేది సరిగ్గా యిక్కడే! ఇక విను జాగ్రత్తగా" అన్నాడు సుందరం.

"మొదటినించీ జాగ్రత్తగానే వింటున్నాను" అన్నాడు రామానుజం.

బార్‌లో వాళ్ళిద్దరూ కూర్చున్న గదిలో వాతావరణానికి ఏదో గాలి సోకింది. ఇద్దరికీ గుండెలు బరువెక్కాయి.

* * *

ఆ రోజు మానేజర్ హోదాకి ద్వితీయ విఘ్నం కూడదని ఆఫీసుకి వెళ్ళిన రాజారావు ఆఫీసులో చాలా రెస్ట్‌లెస్ రోజు గడిపాడు. తనఛాంబర్‌లో తలుపులు మూసేసుకున్నాడు. ఏదో మదనపడుతూ పిచ్చిగా తన టేబుల్‌చుట్టూ పచార్లు చేశాడు. డ్రాయర్ సొరుగులాగి సత్య ఫొటో బైటికి తీసి పదే పదే చూసుకున్నాడు.

సత్య అమెరికాలో పుట్టి పెరిగింది. చాలా పొడుగ్గా, తెల్లగా, ఆరోగ్యంగా ఉంటుంది. ఆమెఅందమంతా మెడ, నడుం, పిరుదుల్లో ఉంది. ఆమె ఎంత బలమైనదో ఆమె నడుము అంత సన్ననిది. ఆమె రాజారావు పనిచేసే కంపెనీ ప్రొప్రయిటరు గారి మనవరాలు.

వరల్డ్ బ్యాంకులో ఎకనామిస్టుగా కొన్నాళ్ళు పనిచేసి మిడియోకర్ ఎకనామిస్టుగా మిగిలిపోవడం ఇష్టంలేక ఆమె రిజైన్‌చేసింది. ఆమె వయస్సు 18 ఏళ్ళే. కాని అప్పటికి జీవితంలో అన్ని అనుభవాలూ ఎక్స్‌ప్రెస్‌గా జుర్రేసింది. స్వేచ్ఛని నూటికి నూరు శాతం వాడుకుని 18 వ ఏట ఆధ్యాత్మిక చింతనలో పడింది. భారతీయ ఇతిహాస గ్రంథాలు, భగవద్గీత అధ్యయనం చేసి కొన్నాళ్ళు స్వంతదేశం ఇండియాలో గడపదాని కొచ్చింది. వస్తూనే తాతగారి ఫ్యాక్టరీలో ఓ సెక్షన్ నిర్వహణ బాధ్యత చేపట్టింది.

ఇక్కడ ఇండియాలో రాజారావు. చురుకెత్తించే ఎండ తప్ప ఆమెకి మరింకేమీ నచ్చలేదు. ఆధ్యాత్మిక చింతన కాదు-అపరిశుభ్రత, అడుక్కునేవాళ్ళు, పేద

రికం. అదే ఇండియా అని త్వరగా నిర్ణయానికి వచ్చేసింది. కాని రాజారావుని చూసిన మొదటి క్షణంలో ఆమెకి అతను చాలా నచ్చాడు. ఓ రోజు తన యింటికి ఆహ్వానించింది. సత్య ఆకర్షణలో పడ్డాడు రాజారావు. తన అంతీంద్రియ శక్తిని ప్రదర్శించి ఆమెని ఆశ్చర్య పెట్టాలని పించింది. ఒకసారి వాళ్ళింట్లో ఆమె ముఖంలోకి తీక్షణంగా చూసి "నువ్వు ప్లానింగ్ కమిషన్‌లో మంచి హోదా ఉన్న ఆఫీసరువవుతావు. నీకు పెళ్ళికాదు, కాని ఇద్దరు పిల్లలుంటారు." అని చెప్పాడు.

"రాజ్.... ఐ డోంట్ లైక్ ఆల్ దిస్ నాన్సెన్స్....జరగబోయేది ఏదైతే మన కెందుకు? ఈ క్షణం మనది. కమాన్" అంది సత్య. షాంపైన్ బాటిల్ తెరిచింది. ఇద్దరూ షాంపైన్ లోకంలో పడి అటునించి అటే జారిపోయారు.

రాజారావుకి తన అందం లోతులు చూపించింది సత్య. పెక్సులో ఆ దది స్వేచ్ఛ చూపెడితే అందే సుఖం ఎంత మత్తెక్కిస్తుందో అర్థమైన రాజారావు తన అతీంద్రియ శక్తులమాట ఆమెదగ్గర మళ్ళీ ఎత్తలేదు. ఆఫీసులో కూడ సత్య కోరిక కలిగినపుడల్లా రాజారావుని తన గదిలోకి పిలిపించుకొనేది. భగవద్గీత గురించి చర్చించుకునేవారు. ఆ తరవాత అతన్ని తనగదికి అటాచ్‌చేసిఉన్న పడకమీదికి తోసి. తన గౌన్, లేదా బెల్‌బాటమ్—జర్కిన్ విప్పేది సత్య. త్వరగా విప్పడానికి వీలుగా కట్టుకొనేది ఆమె బట్టలు.

ఇలాంటి సన్నివేశాలు కొన్ని జరిగిన తరువాతనే రాజారావు సెక్షన్ ఆఫీసరు పదవి నించి మేనేజర్ పదవికి ప్రమోట్ అయ్యాడు. మేనేజర్ స్థానంలో వున్న వరాంకుశం (ఆయనని అడిగి షణ్ముఖం మార్కు ముక్కుపొడి ఓ పట్టుపడుతూ ఉండేది సత్య) డబుల్ గ్రాట్యుటీతో ఇంటికి పంపివేయబడ్డాడు. కంపెనీ పనిమీద ఫారిన్ వెడుతూ రాజారావుకి ఓ గిఫ్ట్ ఇచ్చింది సత్య లిఫ్ట్‌తోపాటు. అది భగవద్గీత గ్రంథం. ఆ గ్రంథం మధ్యన ట్రాన్స్‌పరెంట్ ఫొటో-శ్రీకృష్ణుడి విగ్రహాన్ని సత్య కావలించుకుంటున్న భంగిమ.

రాజారావు ఆ ఫొటోకేసి పదే పదే చూస్తున్నాడు. ఆ ఫొటోలో శ్రీకృష్ణుడి స్థానంలో తనని ఊహించుకుంటున్నాడు. ఆమె పూర్తిగా తనదయిపోతే అనే ఆలోచన కలిగింది. అదే అతన్ని మధన పెడుతోంది.

సడెన్‌గా ఏదో నిర్ణయానికొచ్చాడు. రాజారావు. ఫోన్ మీద చెయ్యివేశాడు. గుండెలో ఓ సంశయం బాధిస్తోంది. మొండిగా ఆ సంశయాన్ని త్రోసి ఫోన్ డయల్ చేశాడు.

"హలో....సుశీలా !"

"అవును....నేనే !"

"ఇప్పుడు నీకు చాలా ముఖ్యమైన విషయం చెబుతున్నాను. జాగ్రత్తగా విను !"

భర్త కంఠంలో ఏదో ఆందోళన-సుశీల కీడు శంకించింది. మంగళ సూత్రాలు కళ్ళకి అద్దుకొంది.

"ఇందాకా నువ్వు అడిగావు గుర్తుందా-పునిస్త్రీగా నా చేతిలో కన్నుమూసే అదృష్టం ఉందా అని?— సారీ సుశీలా.... నీకు అబద్ధం చెప్పాను...."

సుశీల నెత్తిమీద పిడుగుపడ్డట్టు చలించిపోయింది.

"నిన్ను మోసంచేసే ఉద్దేశం లేదు. ఈరోజే నేను నీకు శాశ్వతంగా దూరమవుతున్నానన్న యథార్థం నీకు తెలిస్తే తట్టుకోలేక తల్లడిల్లిపోతావనీ, కొద్దిగంటల దుఃఖాన్నయినా నీకు తప్పిద్దామనీ అబద్ధం చెప్పాను సుశీలా. నాజీవితంలో ఎన్నడూ అబద్ధమాడి ఎరుగను. అందుకే నీకు ఫోన్‌చేసి మళ్ళీ నిజం చెప్పేదాకా మనోవ్యధ తీరలేదు. ఇక కొద్ది గంటలే మిగిలింది మనకి. సరిగ్గా ఒంటిగంట ప్రాంతంలో నా ప్రాణం పోవచ్చు."

"ఏవండీ.... ఏవండీ.... వీల్లేదు.... వీల్లేదు.... ఇది అబద్ధం"

"ధైర్యంగా ఉండు సుశీలా. బ్యాంకులో నీ జీవితానికి సరిపడినంత క్యాష్ భద్రం చేశాను. నీకు కాలం బరువుగా ఒంటరితనంతో గడపనవసరం లేకుండా మా కంపెనీలోనే ఉద్యోగం వేయిస్తాను. నా పేరిట ఉన్న ఆస్తులన్నీ నువ్వు క్లెయిమ్ చేసుకోవడానికివీలుగా యేర్పాట్లు చేయించడానికే ఆఫీసుకి వచ్చాను. ఈ ఆఖరి నిమిషాల్లో...."

సుశీలకి చెవుల్లో ఏమీ నా లరాద. ఆమెకి ఏమీ వినిపించడంలేదు. రాజారావు లేని ఒంటరితనం ముందే ఆమెని భయపెట్టింది 'రాజారావు లేని జీవితం నీకెందుకు .... పునిస్త్రీగా చచ్చిపో.... చచ్చిపో....' అని శపించింది అంతరాత్మ. ఆమెకి యెక్కడలేని ధైర్యం వచ్చింది. చెవిలో రొద మాయమయ్యింది. ఫోన్‌లో మధుర సంగీతం వొలికిస్తోంది రాజారావు కంఠం.

"మీరులేని మీ ఆస్తులు నా కెందుకండీ నో.... అలా జరగదు-"

"పిచ్చిదానా. నా నెత్తిమీద తిరుగుతున్న ఫాన్ కూలిపోయి నామీద పడిపోవచ్చు. నా గదిలో వెర్రిగాలి చెలరేగి నన్ను ఎత్తి కుదేసి ప్రాణం తీయవచ్చు. చాలా సింపుల్‌గా గుండె ఆగిపోవచ్చు.. ఏమైనా కావచ్చు. కాని నేను బ్రతికేది కొద్ది గంటలే. మరణం దైవ శాసనం.... ఎవరూ తప్పించలేరు."

"తప్పించలేరా?

"కానివ్వండి....మీరులేని జీవితం వద్దు. ఒంటిగంట ప్రాంతంలో పరలోకంలో మీకు స్వాగతం చెబుతాను" అంది సుశీల.

"నో....నో .... నేను బయల్దేరి వస్తున్నా....సుశీలా....ఆగు...నేను వచ్చేవరకూ....నన్ను కడసారి చూడవూ.... నాక్కూడా నీ చేతుల్లో పోవాలని వుంది. కారులో బయల్దేరుతున్నా.... ఆగు...."

నాగేశ్వరీ వారి నవలా ప్రసూనాలు!

జొన్నలగడ్డ లలితాదేవి... { ప్రేమశంఖం ................రూ.11/-
ప్రణయనాదం ..............రూ.11/- }

కొడాలి సాంబశివరావు.... వెన్నెల పల్లకి ....................రూ.12/-

గిరిజ శ్రీభగవాన్...... { అత్తగారు మళ్ళీ పుట్టింది...రూ.13/-
డామిట్! ఈ కథ మళ్ళీ-మొదటికొచ్చింది .........రూ.11-50 }

నాగేశ్వరీ పబ్లికేషన్స
కాళేశ్వరరావురోడ్, సూర్యారావుపేట
విజయవాడ-520002.

"వద్దు ....మీ కారుకి యాక్సిడెంట్ అవుతుందేమో వద్దు ....వద్దు."

"నో .... నీ దగ్గరికి వస్తున్నా.... వచ్చేస్తున్నా సుశీలా...." అతను ఫోన్ పెట్టేశాడు.

సుశీల ఫోన్ దగ్గరే స్పృహ తప్పి పడిపోయింది.

మళ్ళీ స్పృహలోకి వచ్చేసరికి గడియారం ముల్లు ఒంటిగంటకి చాలా దగ్గరగా వుంది. వస్తానన్న భర్త రాలేదు.

"ఆయన ప్రాణాలతో ఉండగానే తాను పోవాలి" పట్టుదలగా లేచి పిల్లల గదిలోకి వెళ్ళి ఇద్దర్నీ ఆప్యాయంగా ముద్దుపెట్టుకుంది సుశీల.

ఒంటిగంట తరువాత ఆఫీసునించి కారులో బయలుదేరాడు — తప్పు చేసిన వాడిలా రాజారావు.

అతనికంతా తెలుసు.

ఇంట్లో బెడ్‌రూమ్‌లో ఫాన్‌కి ఉరి పోసుకుని వ్రేలాడిన మందారంలా స్వాగతం చెప్పిందతనికి సుశీల. మంచం మీద పిల్లలిద్దరూ ఏమీ యెరగనట్టే నిద్రపోతున్నారు. అతను అనుకున్నట్టే జరిగింది.

* * *

"చెప్పు దెయ్యాలు లేవూ" అన్నాడు సుందరం ఆవేశంగా.

"సత్య, రాజారావుల చాటు మాటు వ్యవహారం నీకెలా తెలుసు ?" అని అడిగాడు రామానుజం.

"ఫారిన్‌నుంచి తిరిగి వచ్చిన సత్యకి తాను సైకలాజికల్‌గా సుశీలని ఎలా కార్నర్ చేసిందీ చెప్పి- నీ కోసమే ఆదంతా చేశాను మనిద్దరం పెళ్ళి చేసుకొందాం-అన్నాట్ట రాజారావు.'ఇండియాలో మీ మగాళ్ళంతా మృగాలు' అంటూ ఆమె ఎడమకాలితో అతన్ని తన్నేసిందట.అంతే కాదు అతన్ని ఉద్యోగంలోంచి పీకేసింది. తనవల్ల సుశీలకి జరిగిన అన్యాయానికి ఆమె చలించిపోయింది. సుశీల అన్నగారిగా నన్ను వెతుక్కుంటూ వచ్చి ఈ విషాద కథలో తన పాత్రకి సిగ్గుపడి క్షమించమని అడిగింది. అంతేకాదు. రాజారావు మీద లీగల్‌గా ప్రొసీడ్ కావడానికి సత్యా. నేనూ ప్రయత్నించాం. ప్రైమా ఫేసీ లేదన్నారు పోలీసులు, వారంరోజుల దర్యాప్తు తర్వాత కేసు మూసేస్తూ. ఇది చట్టానికి అందని నైతిక సమస్య అన్నారు లాయర్లు...."

"ఇప్పుడు రాజారావు ఏం చేస్తున్నాడు ?"

"ఉత్తర దేశయాత్రలకి పోయాడు—సన్యాసం అంటూ. అతని పిల్లలిద్దర్నీ సత్య తన వెంట అమెరికా తీసుకుపోయింది. వాళ్ళ భవిష్యత్తుకోసం నేను సరేనన్నాను."

"రాజారావు గురించి ఇంకేమీ తెలియలేదా ?"

"లేదు."

"మరి అతను జరగబోయేది చెప్పగలగడం ....ఆ అతీతశక్తి మాటేమిటి ?"

"మనిషి ఎన్ని శక్తులున్నా స్వార్థానికే వాడతాడు. ఉన్న శక్తులతోనే న్యూట్రాన్ బాంబు చేసుక్కూచోలే ? !"

"దేర్ యు ఆర్ ....అక్కడే సరిగ్గా నేనూ ఈ శక్తులు. యుక్తులూ అన్నీ శాప్రజ్ఞుల పరిశీలనకొదిలి పెట్టేశాను" అని రామానుజం కళ్ళు మూసుకున్నాడు. గొప్ప సత్యం కనుక్కున్నవాడిలా మళ్ళీ చెప్పాడు. "అవును సుందరం.... ఒప్పుకున్నాను .... నువ్వన్నటు వున్నాయ్.... మనుషుల్లో దెయ్యాలున్నాయ్.... !!"

"డ్రైవ్ ది డెవిల్ అవుట్" అంటూ మిత్రులిద్దరూ టేబుల్‌మీద మిగిలిన రెండు కాళీ సీసాల్లోకి అగ్గిపుల్లలు గీశారు!


యన్.టి.ఆర్. రాజకీయాల పరిశీలన

నటరత్న: మక్కళ్ తిలకం: రామాయణంలో పిడకల వేట

రచన: నాటి "ఆంధ్రప్రభ శాస్త్రి"




For trade terms, contact
Cards Crafts Classics
8 State Bank Street, P.B. No 2421, Madras-600 002.
Grams: "GREETCARDS" Phone: 83792

ధర: రు. 3/-

SA/B/01